అస్తవ్యస్తంగా సారంగాపూర్ రహదారి

- ప్రయాణికుల పాలిట శాపంగా మారిన వైనం
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో వాహనదారులు





సారంగాపూర్ రోడ్డుపై ఏర్పడిన గుంతలు

నిజామాబాద్ రూరల్: నగరంలోని సారంగాపూర్ ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రూరల్ మండల పరిధిలోని విలీన 13 డివిజన్ అయిన సారంగాపూర్ బోధన్‌కు వెళ్లే రోడ్డు గుంతలమయం కావడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రివేళల్లో గుంతలు కానరాక ద్విచక్రవాహనదారులు గుంతల్లో పడి పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. రహదారిపై గుంతలు ఏర్పడి ఏడాది గడిచినా అధికారులు కన్నెత్తి చూడడం లేదు. అంతే కాకుండా రాత్రివేళల్లో పెద్దపెద్ద వాహనదారులు బోధన్, నిజామాబాద్ వైపు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ నేపథ్యంలో వాహనదారులు గుంతల్లో తమ వాహనాలు పడడంతో వాహనాలు పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సారంగపూర్‌లో రైస్‌మిల్లులు, వివిధ పరిశ్రమలు అధికంగా ఉండడంతో ధాన్యం లోడ్లు, ఇతరాత్ర లారీలు ఎక్కువ శాతం తిరుగుతుంటాయి. దీంతో గుంతలు కాస్త పెద్దగా మారడంతో ప్రయాణం ప్రమాదంగా మారుతోంది. ముఖ్యంగా రాత్రివేళల్లో గుంతలు కానరాకపోయే సరికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారు.

గుంతలు పూడ్చాలి

సారంగాపూర్ 13వ డివిజన్ పరిధిలో ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని స్థానిక ప్రజలు అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నారు. అయినా అధికారుల్లో చలనం లేకుండా పోతోంది. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు త్వరగా చేపట్టాలి



సారంగాపూర్ ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలు అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలి. లేదంటే ప్రయాణికులు, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని పనులు పూర్తి చేస్తే ప్రజలకు ఎంతో మేలు కలుగుతుంది.

– అక్బర్ నవాజుద్దీన్, సారంగాపూర్‌వాసి

అన్నదానంతో ఎంతో పుణ్యం

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



అయ్యప్ప చిత్రపటానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

నిజామాబాద్ రూరల్: అన్నదానంతో ఎంతో పుణ్యం లభిస్తుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. ఆదివారం అయ్యప్ప సేవా సమితి ట్రస్టు ఆధ్వర్యంలో 80 రోజుల పాటు మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందూరు అయ్యప్ప ఆలయాన్ని దర్శించుకుంటే శబరిమల అయ్యప్పను దర్శించుకున్న అనుభూతి కలుగుతుందని అన్నారు. గత 30 ఏళ్లుగా స్వామి వారి మాల ధరిస్తున్న గుండమయ్య గురుస్వామి ఇందూరు ఆలయ నిర్మాణానికి కృషి చేశారని గుర్తు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమం జనవరి 20 వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భక్తవత్సలం, సభ్యులు సురేశ్, ఆగమయ్య, జగన్‌మోహన్, అయ్యప్ప దీక్షా పరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

డీసీసీబీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి



బోర్గాం(పి)లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ వైస్‌చైర్మన్

మోపాల్: ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని ఎన్‌డీసీసీబీ వైస్ చైర్మన్ నల్ల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బోర్గాం(పి), తాడెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం సన్నరకాలకు రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తుందని, ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. జిల్లావ్యాప్తంగా ఆదివారం నుంచి కొనుగోళ్లు వేగవంతమయ్యాయని అన్నారు. ప్రభుత్వం వ్యవసాయం, రైతులకు పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం తేమ శాతం ఉండాలని, తాలు, పొల్లు లేకుండా చేసి కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ జయకృష్ణారెడ్డి, నాయకులు చి ట్టి సాయిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గుత్ప రఘు, సుభాష్, నారాయణరెడ్డి, నర్సారెడ్డి, అభిలాశ్‌రెడ్డి, సాయిరెడ్డి, శేఖర్‌రెడ్డి, మహేందర్, కామర్స్ మోహన్, సాయిబాబా, రాజారెడ్డి, రైతులు, డైరెక్టర్లు, సీఈవో కృష్ణ, సిబ్బంది నర్సయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

తృతీయ సోపాన్ పరీక్ష శిబిరానికి ఎంపిక



సిరికొండ: హైదరాబాద్ స్కౌట్స్ గైడ్స్ ప్రధాన కేంద్రంలో నిర్వహించే తృతీయ సోపాన్ పరీక్ష శిబిరానికి సిరికొండ సత్యశోధక్ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ నర్సయ్య తెలిపారు. శిబిరానికి ఎంపికై న అద్వైత్‌రెడ్డి, రిషి, రమనీశ్, స్నేహిత్, సాత్విక్, యువరాజ్ పటేల్‌ను స్కౌట్స్ గైడ్స్ రాష్ట్ర ప్రతినిధి సాల్మన్, ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ సందర్భంగా సాల్మన్ మాట్లాడుతూ..స్కౌట్స్ గైడ్స్ ద్వారా విద్యార్థులకు చక్కని క్రమశిక్షణ, సేవాభావం, ఉత్తమ వ్యక్తిత్వం అలవడుతుందన్నారు. తృతీయ సోపాన్ పరీక్ష స్కౌట్స్ గైడ్స్‌లో తొలిమెట్టు అని ఉన్నత అర్హతలు, భవిష్యత్తు చదువులకు దోహదపడుతుందన్నారు. ఉపాధ్యాయులు గంగారెడ్డి, అనిల్, కెప్టెన్ వనిత తదితరులు పాల్గొన్నారు.

'సెపక్‌తక్రా' రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సంజీవరెడ్డి



సంజీవరెడ్డి

నిజామాబాద్‌నాగారం: హైదరాబాద్‌లోని ఫతే మైదాన్‌క్లబ్‌లో ఆదివారం తెలంగాణ సెపక్ తక్రా అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గాదరి సంజీవ్ రెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, చామకురా బాగారెడ్డి కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ అధ్యక్షుడు, నూడా చైర్మన్ కేశ వేణు, కార్యవర్గ సభ్యులు ల్యాబ్ గంగారెడ్డి, దీపిక, సతీశ్ రెడ్డి, మీసాల ప్రశాంత్ కుమార్ వారికి అభినందనలు తెలిపారు.

నియామకం



నిజామాబాద్‌నాగారం: జాతీయ బీసీ సంక్షేమ సంఘంలో పలువురు నియామకమైనట్లు జిల్లా అధ్యక్షుడు కెంపుల నాగరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతన్‌కర్ లక్ష్మీనారాయణ తెలిపారు. జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా మండె మోహన్, జిల్లా జాయింట్ సెక్రెటరీగా నగేశ్ యాదవ్, బీసీ జర్నలిస్ట్ ఫోరం ప్రధాన కార్యదర్శిగా జట్టి గోవింద రాజు నియామకం అయ్యారు. ఆదివారం వీరికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ జిల్లా కేంద్రంలో నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగుల మురళి, జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణరావు, నాయకులు చింతకాయల రాజు, సురేశ్, అమంద్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ఖైసర్ టోర్నీ టీ షర్టుల విడుదల



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలో ఈ నెల 10, 11వ తేదీల్లో ఖైసర్ స్పోర్ట్స్ అకడమీ ఆధ్వర్యంలో నిర్వహించే టోర్నీ టీ షర్టులను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, ధర్పల్లి మండలం ఎస్టీ సెల్ అధ్యక్షుడు మంగ్యా పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం నగరంలో కేర్ డిగ్రీ కళాశాలలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రచ్చ మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్ రెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షుడిగా సీహెచ్ చెన్నయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా రాంచందర్, దేవీదాస్, జిల్లా అసోసియేట్ మహిళా అధ్యక్షురాలుగా రత్నకుమారి, జిల్లా ఉపాధ్యక్షులుగా హనుమంతరావు, జిల్లా ఉపాధ్యక్షురాలుగా డీకే ఇంద్ర, జిల్లా కోశాధికారిగా మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శిగా చంద్రు నాయక్, జిల్లా ప్రధాన సలహాదారుగా వినయ్ కుమార్ ఎన్నికయ్యారు.

బహుజన లెఫ్ట్ పార్టీ..

నిజామాబాద్ సిటీ: బహుజన లెఫ్ట్ పార్టీ(బహుజన కమ్యూనిస్టు) నగర కమిటీని ఎన్నుకున్నట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ తెలిపారు. కమిటీ అధ్యక్షుడిగా జన్నేపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఎనుగుల చంద్రాగౌడ్, ఉపాధ్యక్షులుగా మేకల స్వామి, ఆశం స్వాతి, డి కిశోర్, ఈర్ల రాజేందర్, లక్ష్మి, సహాయ కార్యదర్శులుగా శాంతాబాయి, గంగామణి, రేఖ ఎన్నికయ్యారు.

కార్తీకం.. పరమ పవిత్రం

- ప్రారంభమైన కార్తీకమాసం
- మహిళల ప్రత్యేక పూజలు
- నోములు, వ్రతాలకు ప్రత్యేకత
- సోమవారానికి ఎంతో విశిష్టత
- ఆలయాల్లో నెలకొన్న సందడి



ఆకాశ దీపం వెలిగిస్తున్న ఆలయ ఈవో శ్రీరాం రవీందర్ గుప్తా దంపతులు

నిజామాబాద్ రూరల్: కార్తీక మాసం శివకేశవుల ప్రీతికరం.. అందుకే ఈ మాసాన్ని పరమ పవిత్రమైనదిగా భావిస్తారు. శివుడికి మారేడు దళాలతో విష్ణువుకు తులసి దళాలతో ఈ మాసంలో పూజిస్తే అనుకూలమైన ఫలితాలు ఉంటాయని పురాణాలు చెబుతున్నాయి. తెలుగు నెలల్లో కార్తీక మాసానికి ఎంతో ప్రత్యేకత ఉంది. కార్తీకం అంటే జ్ఞానానికి ప్రతీక. శివుని వంటి దైవం గంగా నది వంటి పవిత్రమైనది. కార్తీక మాసం సమైక్యతను స్ఫూరించే మాసం, ఏడాదిలోని పన్నెండు నెలలకు ఎన్నో ప్రత్యేకతలు పండుగలు ఉంటాయి. మానసిక ఆరోగ్యానికి, ధాన ధర్మాలకు, పరోపకారానికి, సామాజిక అనుబంధానికి కేంద్రమైన మాసం దివ్య కార్తీకం. దేవదేవులైన శివ కేశవులు ఇరువురికి కార్తీక పౌర్ణమి అంటే ఎంతో ప్రీతి. కార్తీక పౌర్ణమి రోజు శివాలయాలు, వైష్ణవాలయాల్లో సాయంత్రం వేళల్లో ద్వారానికి రెండు వైపులా దీపాలను వెలిగిస్తే సర్వపాపాలు తొలగి వైకుంఠ ప్రాప్తి కలుగుతుందని శాస్త్రం చెబుతోంది. కార్తీక పౌర్ణమి రోజున దీపాలు వెలిగించడమే కాకుండా సత్యనారాయణ స్వామి అనుగ్రహం కోసం ఎంతోమంది స్వామి వారి వ్రతాన్ని ఆచరిస్తూ ఉంటారు.

తులసి కల్యాణం

కార్తీక పౌర్ణమి రోజున మరో ప్రధాన కార్యక్రమం తులసీ కల్యాణం. మన ఆడపడుచులు స్నానం చేసిన తర్వాత తులసీకోటకు ప్రదక్షిణలు చేసి పూజలు నిర్వహించడం అనాధిగా వస్తోంది. అయితే కార్తీక పౌర్ణమి రోజున తులసీ కల్యాణాలు నిర్వహిస్తే ఎన్నో జన్మల ఫలంగా భావిస్తుంటారు. కార్తీక మాసంలో ప్రతి ఏడాది శివాలయానికి వెళ్లి ఆలయ ఆవరణలో శివనామ స్మరణ చేస్తూ 363 ఒత్తులు వెలిగిస్తారు. సూర్యోదయానికి ముందు ఇంట్లో పూజలు చేసి ఇంటి ఎదుట దీపాలు వెలిగిస్తారు. భక్తి శ్రద్ధలతో కార్తీక మాసంలో పూజలు చేస్తే స్వామి వారి అనుగ్రహం లభిస్తుందని భక్తుల నమ్మకం. అంతేకాకుండా శివుని, వేంకటేశ్వర స్వామికి పూజలు నిర్వహించి ఉపవాస దీక్ష తీసుకుంటారు.

మట్టి దీపారాధనతోనే ముక్తి

కార్తీక మాసంలో మహిళలు వేకువ జామునే లేచి తలంటు స్నానాలు చేసి ఇంట్లో మట్టి దీపాలు వెలిగించి ఆలయాలకు వెళ్లి పూజలు చేస్తుంటారు. ఈ నెలలో ఆలయాల్లో దీపాలు వెలిగించి తమ కుటుంబానికి అంతా మంచి జరగాలని పూజలు నిర్వహిస్తారు. ఇంటి ఆడపడుచులను పిలుచుకొని లక్ష్మి దీపారాధన చేస్తారు. మట్టి దీపారాధన చేస్తే ఎంతో ముక్తి కలుగుతుందని శాస్త్రం చెబుతోంది. అందుకని నాటి నుంచి మట్టి దీపంతుల్లోనే దీపారాధన కొనసాగుతోంది.

అన్నీ పవిత్ర దినాలే..

కార్తీక మాసంలో అన్నీ పవిత్రమైన రోజులుగా భావిస్తారు. ఈ నెలలోని అన్ని రోజులు పవిత్రమైన దినాలు భావిస్తారు. ఈ నెలలో చేసే పూజలకు ఎంతో ప్రాధాన్యత చేకూరుతుంది.

విశ్వబ్రాహ్మణులు అన్ని రంగాల్లో ముందుండాలి

నిజామాబాద్‌నాగారం: విశ్వబ్రాహ్మణులు అన్ని రంగాల్లో ముందుండాలని నిజామాబాద్ ఏసీపీ సీసీఎస్ నాగేంద్రచారి అన్నారు. ఆదివారం నగరంలోని న్యూఅంబేడ్కర్ భవన్‌లో ప్రొఫెసర్ జయశంకర్ ఆచార్య విశ్వస్ఫూర్తి, విశ్వకీర్తి ప్రతిభా పురస్కారాల కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్ర సాధన కోసం జయశంకర్ ఎంతో శ్రమించారని అన్నారు. కార్యక్రమంలో నరసింహచారి, ఆనంద్ కుమార్, దొంతోజు హరికృష్ణ, లక్ష్మణాచారి, రాజారాం, శ్రీధర్, మనోహరచారి, కిరణ్, రాజన్న, సదానంద్ చారి తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ బాధితుడికి భరోసా



మోపాల్: దుబాయిలో రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన మండలంలోని ఒడ్డెరకాలనీకి చెందిన కొమ్రె నర్సింహులును నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి ఆదివారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.విషయాన్ని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం ద్వారా అన్ని విధాలుగా ఆదుకుంటామని అన్నారు. ఆయన వెంట నాయకులు మక్కల సాయిలు,స్థానికులు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంగాస్థాన్–2లో దొంగతనాలపై ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ స్థానిక ప్రజలకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు వివాహాలు, తీర్థయాత్రలకు వెళ్లేటప్పుడు ముందస్తుగా పోలీసులకు, నమ్మకమైన వారికి సమాచారం అందించాలని సూచించారు. అదే విధంగా ప్రతి వీధిలో సీసీ కెమెరాలను కాలనీవాసులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

9న డీవీకే విగ్రహావిష్కరణ



మాట్లాడుతున్న రామకృష్ణ

సిరికొండ: ఆర్మూర్‌లో సీపీఐఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి డీవీ కృష్ణ విగ్రహావిష్కరణను ఈ నెల 9న నిర్వహించనున్నట్లు మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు పిట్ల రామకృష్ణ తెలిపారు. మండలంలోని గడ్కోల్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ శ్రేణులు, కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. విప్లవోద్యమ నిర్మాణం కోసం జీవితాంతం కృషి చేసిన నాయకుడు డీవీకే అని కొనియాడారు. నాయకులు రమేశ్, రమ, దామోదర్, సాయారెడ్డి, రమేశ్, లింబాద్రి, పుష్పలత, అనీస్, కిశోర్, బాల్‌రెడ్డి, రామన్న పాల్గొన్నారు.

రేషన్ షాప్ ప్రారంభం



రేషన్‌షాపును ప్రారంభిస్తున్న గంగాధర్

డిచ్‌పల్లి: మండలంలోని ఘన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన నూతన రేషన్ షాప్‌ను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అమృతపూర్ గంగాధర్ ఆదివారం ప్రారంభించారు. ప్రజలకు రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని రేషన్ డీలర్ రేకులపల్లి స్వాతికి సూచించారు. కార్యక్రమంలో డీసీసీ డెలిగేట్ ధర్మాగౌడ్, నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేవకరుణ, పార్టీ మండల యువజన కాంగ్రెస్ నాయకులు చాకి వెంకటేశ్, శంకర్ గౌడ్, బండి లక్ష్మి, శేరు లింగం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నాయకులు



సిరికొండ: మండలంలోని న్యావనందికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే భూపతిరెడ్డిని ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. గ్రామానికి చెందిన సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ఏఎంసీ డైరెక్టర్ రిక్క ముత్తెన్న, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నరేందర్, మహిపాల్, సాగర్ తదితరులు ఉన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి



గోడప్రతులను ఆవిష్కరిస్తున్న సభ్యులు

నిజామాబాద్ నాగారం: జిల్లా వ్యాప్తంగా ఈనెల 10న నిర్వహించే మాలల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మాల ఎంప్లాయీస్ జిల్లా కన్వీనర్ సక్కి, ఉదయ్‌కుమార్ కోరారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మాల మాదిగలను విభజించడానికి కుట్రలు పన్నుతున్నారని, మాలలను ఐక్యంచేసి ఒకతాటిపైకి తీసుకొచ్చి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని శ్రావ్యగార్డెన్‌లో కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లాలోని మాల ఉద్యోగులు, కులస్తులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో కోకన్వీనర్లు ఎ అమృత్, చొక్కం దేవీదాస్, ఎడ్లనాగరాజు, సుశీల్, లింగయ్య, దేవయ్య, చందు, నారాయణ, ఎల్లం, మురళి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



సిరికొండ: గంజాయి, మత్తు పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలని ఎస్సై ఎల్ రామ్ సూచించారు. మండలంలోని న్యావనందిలో ఆదివారం కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా వివిధ అంశాలపై ఎస్సై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మట్కా, సైబర్ క్రైమ్ మోసాలపై అవగాహన కల్పించారు.హెడ్ కానిస్టేబుల్ జీవన్,శంకర్,కానిస్టేబుల్ సుధాకర్ ఉన్నారు.

నేడు మీ–సేవ కేంద్రాలకు సెలవు

బోధన్‌రూరల్: మండలంలోని అన్ని మీ–సేవ కేంద్రాలకు సోమవారం సెలవు ఉంటుందని ఆధార్, మీ–సేవ సీఎస్సీ ఆపరేటర్స్ యూనియన్ ప్రతినిధులు ఆదివారం తెలిపారు. తెలంగాణ మీ–సేవ ఫెడరేషన్, ఆధార్ మీ–సేవ సీఎస్సీ ఆపరేటర్స్ అసోసియేషన్ 13 వసంతాలు పూర్తి చేసుకుని 14వ వసంతంలో అడుగుపెడుతున్న నేపథ్యంలో వార్షికోత్సవాలను హైదరాబాద్‌లో టీఆర్టీ కళాభవన్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. మీ–సేవ కేంద్రాలకు సోమవారం సెలవు మంజూరు చేయాలని తహసీల్ కార్యాలయంలో నిర్వాహకులు వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

సమగ్ర కులగణనలో బీసీలు పాల్గొనాలి



నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కుల గణనలో బీసీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని బీఎల్‌పీ నాయకుడు దండి వెంకట్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నగర కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. కులగణనలో 139 బీసీ కులాల ప్రజలు తమ వివరాలను సర్వేయర్లకు ఇవ్వాలన్నారు. బీసీలకు అన్యాయం జరిగితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు సబ్బని లత, రేణుక, స్వప్న, శాంతాబాయి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



రుద్రూర్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు అన్నారు. పోతంగల్ మండల కేంద్రంలో నిర్వహించిన పీఎస్ఆర్, కేబీఆర్ వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని అన్నారు. అనంతరం టోర్నమెంట్ నిర్వాహకులకు అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పుప్పాల శంకర్, మాజీ జడ్పీటీసీ శంకర్ పటేల్, ఏఎంసీ చైర్మన్ హన్మంతు, నాయకులు శాంతీశ్వర్ పటేల్, గందపు పవన్, గంట్ల విఠల్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మసమాజ్ పార్టీ ప్లీనరీకి తరలిన నాయకులు



డిచ్‌పల్లి నుంచి తరలివెళ్తున్న నాయకులు

డిచ్‌పల్లి: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ధర్మసమాజ్ పార్టీ ప్లీనరీకి డిచ్‌పల్లి మండల నాయకులు తరలివెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు సుభాష్ మాట్లాడుతూ.. గతేడాది సరూర్‌నగర్‌లో విశారదన్ ఆధ్వర్యంలో ధర్మసమాజ్ పార్టీని స్థాపించారన్నారు. సబ్బండ కులాలు, పేదల సంక్షేమం కోసం పార్టీ కృషి చేస్తుందన్నారు. ప్లీనరీకి తరలిన వారిలో నాయకులు మోహన్, దాసు, పోచయ్య, రాకేశ్, నర్సయ్య, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	82,400	వెండి(కిలో)	1,03,500
22 క్యారెట్స్	76,035	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	24	40	గాజరుగడ్డ	50	80
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	60	80	దోసకాయ	30	50
దొండకాయ	40	80	ఆలుగడ్డ	35	60
బీర్నీసుకాయ	80	120	గోబిగడ్డ	25	50
కాకరకాయ	40	80	గోబిపువ్వు	50	90
వంకాయ	50	75	బీట్‌రూట్	50	90
పాలకూర	30	50	కరివేపాకు	40	70
మెంతికూర	60	80	చామగడ్డ	40	70
కొత్తిమీర	50	80	గోరుచిక్కుడు	50	80
పుదీనా	60	90	చిక్కుడుకాయ	50	80
క్యాప్సికం	60	90			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	లక్కీ భాస్కర్ (తెలుగు)-10.40, 1.35, 4.35, 7.30, 10.30
స్క్రీన్-2	సింగం అగైన్(హిందీ)-10.35,7.30 క - (తెలుగు) - 01.40 అమరన్ - (తెలుగు) - 4.30 భూల్ భూలయ్య-3(హిందీ)-10.50
స్క్రీన్-3	అమరన్ - (తెలుగు) - 10.10, 1.20, 10.30 భూల్ భూలయ్య-3(హిందీ)-4.40 క - (తెలుగు) - 7.30 అమరన్(తెలుగు)-10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	భూల్ భూలయ్య (హిందీ)-9.35 4.10 సింగం అగైన్(హిందీ)-1.00, 7.35,10.45
స్క్రీన్-2	లక్కీ భాస్కర్(తెలుగు)-9.45,1.00, 4.15,7.30,10.45
స్క్రీన్-3	సింగం అగైన్ (హిందీ)-9.25 క(తెలుగు)-12.35 7.15 శ్రీ మురళి బఘీర(తెలుగు)-3.50 భూల్ భులయ్యా (హిందీ)-10.30
స్క్రీన్ -4	అమరన్(తెలుగు)-9.50 1.20 7.25 10.55 వెనమ్ ది లాస్ట్ డ్యాన్స్(ఇంగ్లీష్)-4.50
లలితామహల్	దేవర పార్ట్-1 (తెలుగు)
దేవి	లక్కీ భాస్కర్ (తెలుగు)
నటరాజ్	అమరన్ (తెలుగు)
విజయ్	క (తెలుగు)